క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీనర్సింహుడి గరుడసేవ



మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని గరుడ వాహనంపై మంగళవారం ఊరేగించారు. భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మధుసూదనాచారి, శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నంగునూరు(సిద్దిపేట): జేపీ తండా ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. చక్కటి బోధనతో ఆకట్టుకున్న విద్యార్థులను కాంప్లెక్స్ హెచ్ఎం ప్రభాకర్‌రావు, పాఠశాల హెచ్‌ఎం సంగు రామకృష్ణ, ఉపాధ్యాయులు చంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్పీలు అశోక్ అభినందించారు.

దేశ్‌పాండే ఫౌండేషన్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సర్పంచ్

నంగునూరు(సిద్దిపేట): గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు దేశ్‌పాండే ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని సర్పంచ్ అజీద్ అన్నారు. నర్మేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్ తరగతుల ముగింపు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శన, నమూనా స్టాళ్లు ఆకట్టుకున్నాయి. శిక్షణ కాలంలో కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కళ్లాటి శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ నర్సింలు, ఉపాధ్యాయులు సీతారాములు, శ్రీకాంత్, పద్మ, శారద, లావణ్య, శిల్ప, వంశీ పాల్గొన్నారు.

'పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం విఫలం'

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచి ఉన్నతస్థాయి పరీక్షలను నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌టీపీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎదుల్ల నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని లక్షల మంది నిరుద్యోగుల జీవితాల్లో ఆందోళన మిగిల్చిన టీఎస్‌పీఎస్సీ పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారం మరవకముందే పదో తరగతి పరీక్షా పత్రాల లీకేజీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తుందన్నారు. పరీక్షల నిర్వహణలో రాష్ట్ర విద్యాశాఖ పూర్తిగా విఫలమైందన్నారు. పదో తరగతి పరీక్షలను కూడా సమర్థవంతంగా నిర్వహించలేని విద్యాశాఖ మంత్రి వెంటనే ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలన్నారు. విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. సమావేశంలో నాయకులు తిరుపతిరెడ్డి, అఖిల్, శివశంకర్, చిరు ఉన్నారు.

కంపోస్టు ఎరువుతో భూసారం పెంపు

కొండపాక(గజ్వేల్): వర్మీ కంపోస్టు ఎరువుతో భూసారం పెరుగుతుందని సర్పంచ్ కందూరి కనుకవ్వ పేర్కొన్నారు. మండలంలోని లకుడారం గ్రామంలో గల డంపింగ్ షెడ్‌లో ఈజీఎస్ పథకంలో తయారు చేసిన వర్మీకంపోస్టు ఎరువును మంగళవారం రైతులకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హర్షత్, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరం సందర్శనకు మంగళవారం సీఎస్ శాంతికుమారి, రాష్ట్ర హెల్త్ అండ్ కమిషనర్ శ్వేతతోపాటు కలెక్టరు ప్రశాంత్ జీవన్ పాటిల్‌లు వస్తున్నారన్న నేపథ్యంలో ఏఎన్ఎం, ఆశవర్కర్లు శిబిరంలో ప్రజలు ఎక్కువగా పరీక్షలు చేయించుకులా చూశారు. సర్పంచ్ కందూరి కనుకవ్వ ఐలయ్య దంపతులకు వైద్యులు కంటి పరీక్షలు చేశారు. అనివార్య కారణాలతో వారు సందర్శనకు రాలేకపోయారంటూ ఎంపీడీఓ రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ ఐపీఎం శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగా షెడ్ ప్రారంభం ఎప్పుడో?

- పనులు పూర్తయి రెండు నెలలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



అక్కన్నపేట ఆరోగ్య యోగా షెడ్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిర్మించిన ఆరోగ్య యోగా షెడ్ ప్రారంభం ఎప్పుడో? అనే విమర్శలు గుప్పుమంటున్నాయి. షెడ్ పనులు పూర్తయి దాదాపుగా రెండు నెలలు కావస్తోందని వైద్య సిబ్బంది, ప్రజలు బహిరంగంగా చెబుతున్నారు. కానీ ప్రారంభానికి మాత్రం యోగా షెడ్ నోచుకోవడం లేదని దీర్ఘకాలిక రోగులు ఆవేదన వెళ్లగక్కుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగా ప్రాముఖ్యతను గుర్తించి జిల్లా వ్యాప్తంగా 16 ఆయుష్ ఆస్పత్రుల్లో యోగా కేంద్రాలను మంజూరు చేసింది. ఇందులో భాగంగా అక్కన్నపేట మండలానికి యోగా షెడ్ నిర్మాణానికి సుమారుగా రూ.3లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో సదరు కాంట్రాక్టర్ అన్నీ హంగులతో నిర్మాణ పనులను పూర్తి చేశాడు. స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో షెడ్ ఇంకా ప్రారంభానికి నోచుకోవడం లేదన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఏదేమైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి వెంటనే ఆరోగ్య యోగా షెడ్‌ను ప్రారంభించాలని రోగులు, మండల ప్రజలు కోరుతున్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సన్ ఫ్లవర్(పొద్దు తిరుగుడు) పంట కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. సన్ ఫ్లవర్ క్వింటాల్‌కు రూ.6400లు ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందన్నారు.

బీటీరోడ్లకు నిధులు మంజూరు

నియోజకవర్గంలోని పలు తండా బీటీరోడ్ల నిర్మాణానికి ఎస్టీ కోటా నుంచి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తెలిపారు. హుస్నాబాద్ మండలం జిల్లెల్లగడ్డ నుంచి మీర్జాపూర్, బల్లునాయక్ తండా వరకు రూ.2.50కోట్లు, అక్కన్నపేట మండలంలోని మైసమ్మ వాగుతండా నుంచి కేశనాయక్ తండా వరకు రూ.2.25కోట్లు, కుందనవాని పల్లె నుంచి సీతారాంతండా వరకు రూ.1.95కోట్లు, కోహెడ మండలం బస్వాపూర్ పరిధిలో సింగనాయక్‌తండా నుంచి బంగారితండా వరకు రూ.1.05కోట్లు, ఘనపూర్ నుంచి రాయికల్‌తండా వరకు రూ.2.80కోట్లు, హుస్నాబాద్ గిరిజన భవన్‌కు అదనంగా రూ.2కోట్లు, హుస్నాబాద్ ఎస్టీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలకు అదనంగా రూ.5కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ భూక్య మంగ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజని, వైస్ చైర్‌పర్సన్ రజిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, డైరెక్టర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మార్కెట్‌లోనే విక్రయాలు జరపాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్



వ్యాపారులతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్

గజ్వేల్: కూరగాయలు, పండ్లు, మాంసం వ్యాపారాలు ఖచ్చితంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని గజ్వేల్ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని గజ్వేల్‌లో దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని హంగులతో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్‌ను నిర్మించారని కొనియాడారు. సీఎం ఆశయాలకనుగుణంగా మార్కెట్‌ను తీర్చిదిద్దాల్సిన అవసరముందన్నారు. కొందరు ఇప్పటికీ బయట వ్యాపారాలను నిర్వహించడంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్ఫూర్తికి విఘాతం కలుగుతుందన్నారు. ఈ దుస్థితిని నివారించాల్సిన అవసరముందన్నారు. మార్కెట్‌లో పరిశుభ్రతను పాటిస్తూ తాజా కూరగాయలు, మాంసం విక్రయిస్తున్న వ్యాపారస్తులను సత్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. మరోవైపు ఏపీ, తెలంగాణలోనే తొలిసారిగా ఈ మార్కెట్‌కు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ వచ్చినట్లు తెలిపారు. ఈ ఖ్యాతిని కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ, సూపర్‌వైజర్ మహిపాల్, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్



చెక్కు అందజేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని మాచిన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త శేరిల్ల లక్ష్మణ్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్‌లో చేసిన పాలసీ ద్వారా రూ.2 లక్షల బీమా చెక్కు మంజూరైంది. దీంతో మంగళవారం బాధితుడి భార్య లక్ష్మికి ఎంపీ చెక్కు అందించారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ మల్లేశం, నాయకులు కుమార్, భూషణం, నాగరాజు, తదితరులున్నారు.

బీటీరోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి

దుబ్బాకటౌన్: బీటీరోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న బీటీరోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రూ.4.5 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో 5.5 కిలోమీటర్ల మేర బీటీరోడ్డు నిర్మిస్తున్నారన్నారు. బీటీరోడ్లతో పట్టణం స్వచ్ఛతగా మారుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గన్నె భూంరెడ్డి, మూర్తి శ్రీనివాస్‌రెడ్డి, దేవుని చంద్రయ్య, ఏతి పృథ్వీరాజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

వడగళ్ల వానతో నష్టం



రాలిన మామిడి కాయలను చూపుతున్న రైతులు

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని ఘణపూర్‌లో మంగళవారం సాయంత్రం కురిసిన అకాలవర్షం, వడగళ్ల వానతో పంటలకు నష్టం వాటిల్లింది. గాలి దుమారంతో వడగళ్ల వాన కురవడంతో మామిడికాయలు రాలిపోయాయి. వరి, మొక్కజొన్న పంటలు వాలగా, రైతువేదికతో పాటు బావుల వద్ద నిర్మించిన షెడ్ల రేకులు ఎగిరి పోయాయి.

తండాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



నంగునూరు: క్షీరాభిషేకం చేస్తున్న లంబాడీలు



హుస్నాబాద్: క్షీరాభిషేకం చేస్తున్న నాయికులు

హుస్నాబాద్: నియోజకవర్గంలోని పలు తండాల బీటీరోడ్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం గిరిజన నాయకులు సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ మంగ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు బీలునాయక్, రాంచంద్రం నాయక్, నాయకులు రమేశ్‌నాయక్, రాజునాయక్, తిరుపతినాయక్, సత్యంనాయక్ తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్‌రూరల్: గిరిజన తండాల్లో బీటీరోడ్లకు నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం గిరిజనులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగ, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజనీతిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు లావుడ్య స్వరూప, ఇస్లావత్ రజిత, తరాల లత, వంగ విజయలక్ష్మి, వెంకట్రామిరెడ్డిలు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

నంగునూరు(సిద్దిపేట): సిద్దిపేట నియోజకవర్గంలో బంజారా భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం జేపీ తండా, బద్దిపడగ, గట్లమల్యాల, సీతరాంపల్లి తండాలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుక్యా భిక్షపతినాయక్ మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు మమత, రంగవ్వ, కమలవ్వ, సంపత్‌నాయక్, లక్ష్మణ్, రమేశ్, మల్లేష్, రాజేందర్, రమేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హుస్నాబాద్: పట్టణంలోని బాలాజీనగర్ 15వ బూత్‌లో మంగళవారం బీజేపీ బూత్ సశక్తికరణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగాన్ని చదివి వినిపించారు. అనంతరం బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతీ ఒక్కరికి తెలిసేలా వివరించాలన్నారు. ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపారన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో స్వల్పకాలిక విస్తారక్ జున్నోజు శ్రీకాంత్, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ రాంప్రసాద్, నాయకులు లక్ష్మణ్, నవీన్, ఆంజనేయులు, రమేశ్, సాగర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



చేర్యాల(సిద్దిపేట): శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణి

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యాక్రమాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణిశ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని 11వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక కౌన్సిలర్ ముస్త్యాల తారతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, జుబేదా ఖాతూన్, సతీశ్‌గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు అంజనీదేవి, నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ ప్రభాకర్, వైద్యులు డాక్టర్ రమ్య, వైద్యసిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): కంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఎంపీపీ మాలోతు లక్ష్మి అన్నారు. మంగళవారం అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జిల్లెల అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ భూపతి సుదేష్ణ, ఎంపీఓ కవికుమార్, పంచాయతీ కార్యదర్శి మోహన్ నాయక్, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 17వ వార్డులో కంటివెలుగు శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ మేరకు మంగళవారం శరభేశ్వర ఆలయంలో ముంగిపు కార్యక్రమాన్ని స్థానిక వార్డు కౌన్సిలర్ కొత్తపల్లి రాధావేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఈ శిక్షణ శిబిరంలో సేవలు అందించిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ సుల్తానా, అఖిల్, రంజిత్, వెంకటమ్మ, లక్ష్మి , రేణుక, సుజాత, యాదగిరి, సాయి, కృష్ణ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని సీఎం స్వగ్రామమైన చింతమడకలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు, సర్పంచ్ హంసకేతన్‌రెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జ్యోతిదేవేందర్, ఉపసర్పంచ్ రవి, సెక్రటరీ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.


మాలల సంక్షేమానికి చొరవ చూపాలి



ఎన్నికైన మండల కమిటీ సభ్యులు

గజ్వేల్‌రూరల్: మాలల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని మాలమహానాడు గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు మన్నె శేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని మహతీ ఆడిటోరియం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాలమహానాడు గజ్వేల్ మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా నరేశ్, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్, గౌరవాధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా కొప్పు రవి, కార్యవర్గ సభ్యులు నర్సింలు, హరికృష్ణ, ఉపేందర్, రమేశ్, ఎల్లయ్య తదితరులను నియమించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మన్నె శేఖర్ మాట్లాడుతూ.. మాలలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూడడం తగదన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ఆమడ దూరంలో మాలలు ఉన్నారని, వారిని చైతన్యపరిచే విధంగా చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో కిష్టయ్య, మల్లేశం, నర్సింగరావు, భాను, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రాలు ప్రారంభం



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వంశీధర్

సిద్దిపేటజోన్: వేసవికాలం నేపథ్యంలో కేఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో అంబలి కేంద్రాలను ఫౌండేషన్ చైర్మన్ వంశీధర్‌రావు ప్రారంభించారు. పట్టణంలోని కమాన్‌రోడ్, విక్టరీ టాకీస్, ఎక్బాల్ మినార్ వద్ద అంబలి కేంద్రాలను ప్రారంభించారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజు, ఎజాజ్, సురేందర్, యూసుఫ్, రవి తదితరులు పాల్గొన్నారు.

'మూడోసారి బీఆర్‌ఎస్‌కే అధికారం'

దుబ్బాకరూరల్: మండుటెండల్లో సైతం పంటలకు నీరందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా బీడు భూములన్నీ సాగులోకి వచ్చాయన్నారు. ఎక్కడ చూసిన పచ్చని పంట పొలాలతో కళకళలాడుతున్నాయన్నారు. రాష్ట్రంలో రైతులకు అమలు చేస్తున్న పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీని స్థాపించాడన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయన్నారు. గ్రూప్ వన్ పేపర్ లీకేజీ పేరుతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గ్రూప్ వన్ పేపర్ లీకేజీలో ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఉపఎన్నికల్లో రఘునందన్‌రావు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గానికి చేసిందేమి లేదన్నారు. ప్రజలకు లేని పోని హామీలు ఇస్తూ మోసం చేశాడని విమర్శించారు. మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **చలివేంద్రం ఏర్పాటు**

జగదేవ్‌పూర్(గజ్వేల్): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని కొండపోచమ్మ ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆలయం వద్ద సర్పంచ్ రజితరమేశ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, మహేశ్, రాజు, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, చిన్నా, హరి, శ్రీను, సుధాకర్, చందు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

◆ **సన్మానం**

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మైసమ్మవాగుతండా వయా చెరువుముందుతండా, గొల్లపల్లి వరకు, కుందనవానిపల్లి వయా చౌటకుంట, సీతారంతండా, గండిపల్లి ఎక్స్‌రోడ్డు వరకు గిరిజన తండాలకు బీటీరోడ్లు నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ను మంగళవారం జెడ్పీటీసీ భూక్య మంగశ్రీనివాస్‌లు హన్మకొండలో ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువాతో సన్మానించారు. అదేవిధంగా మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్‌కు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు భూక్య తిరుపతి, సంపత్, మోహన్‌నాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

తొగుట(దుబ్బాక): సీఎం కేసీఆర్ కృషితో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి కోరారు. మండలంలోని పెద్దమాసాన్‌పల్లిలో బీఆర్‌ఎస్ బూత్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. మండలంలోన్ని అన్ని గ్రామాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. పెద్ద మాసాన్‌పల్లి బూత్ కమిటీ అధ్యక్షులుగా పురమాండ్ల నారాయణరెడ్డి, కోల కనకాగౌడ్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా బి.మహేందర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌లు వరలక్ష్మిస్వామి, గోవర్దన్‌రెడ్డి, ఎంపీటీసీ సుమలత, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, ఉపసర్పంచ్ రాజిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నారాయణరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

◆ **మిత్రుడి కుటుంబానికి చేయూత**

గజ్వేల్‌రూరల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి తోటిమిత్రులు అండగా నిలిచారు. గజ్వేల్ పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ మణి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి ఆటో డ్రైవర్లు తమ యూనియన్ తరఫున మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, క్వింటాల్ బియ్యంతో పాటు రూ.5వేల నగదును అందించి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆసా, వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలుగౌడ్, గౌరవాధ్యక్షుడు కృష్ణ, డ్రైవర్లు అభిలాష్, మహేశ్, మనువర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

గజ్వేల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డుకు చెందిన రామమణికి రూ.60వేలు, నర్సవ్వకు రూ.36వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వార్డు కౌన్సిలర్ గుంటుకు శిరీషరాజు మంగళవారం పంపిణీ చేశారు.

◆ **డీజే పెడితే చర్యలు తప్పవు**

దుబ్బాక: అధిక శబ్దాలు కలిగిన లౌడ్‌స్పీకర్లు, డీజే శబ్దాలను పెడితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ హెచ్చరించారు. మంగళవారం దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల వద్ద పలు గ్రామాల్లో ప్రొజెక్టర్ ద్వారా సినిమా ప్రదర్శనలో అధిక శబ్దాల స్పీకర్లతో సౌండ్ పెట్టడంతో పది విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కావున ఎవరైనా అధిక శబ్దాలు గల డీజే సౌండ్స్, స్పీకర్లు పెడితే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ **పేదల సంక్షేమమే ధ్యేయం**

గజ్వేల్‌రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని బయ్యారం సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను మంగళవారం గ్రామంలోని పలువురు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేశ్, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కుమార్, బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు మోహన్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **అక్రమాలను ప్రశ్నించినందుకే ఆరోపణలు**

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో జరిగిన అక్రమాలను ప్రశ్నించినందుకే ఆలయ చైర్మన్ గీస భిక్షపతి తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూర్గు సురేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్టర్ రఘువీరారెడ్డి వద్ద తాను డబ్బులు డిమాండ్ చేసినట్లు విడుదల చేసిన ఆడియో క్లిప్పింగ్‌లతో సంబంధం లేదని, అది తన వాయిస్ కాదన్నారు. ఆలయ చైర్మన్ అవినీతిని త్వరలో ఆధారాలతో బయట పెడతానని స్పష్టం చేశారు. ఆలయంలో అక్రమాలు జరగలేదని గంగిరేణి చెట్టు వద్ద ప్రమాణం చేస్తే రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దండ్యాల వెంకట్ రెడ్డి, కృష్ణారెడ్డి, సనాది కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.